# సంప్రదాయం

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

అనుకోలేదు నారాయణబాబు. అప్పుడే భోంచేసి కొంచెం నస్యం సేవిస్తూ వసారాలో అటూ ఇటూ వో గడియ తచ్చాడి పొద్దున ఇనప్పెట్టె తాళం చెవులు సవరించుకునేసరికి ఆవలింతలొచ్చాయి. వాకిట్లో జట్కా ఆగిన అలికిడి గమనించ లేదాయన. తిన్నంగా లోపలకొస్తోంది. కమలకి కాలేజీ సెలవలని తెలుసునుగాని, ముందస్తుగా వుత్తరం వ్రాయకుండా వొచ్చే అలవాటు లేదే అన్న దిలాసాలో వుండిపోయాడు. అమ్మాయి జట్కా దిగి "గుడ్-బై" చెబుతోం దప్పుడే ఎవరితోనో.

"లేవు లైబ్రరీనించి 'షా' తెచ్చి పెడతానుగదూ?" అంటోంది. — పరకాయించి చూచాడు. సన్నటి క్రాఫూ, పాండూరు ఖద్దరులాల్చీ, చిన్న రిస్టువాచీ అతిసింపిల్ గా ఉన్నాడు. ఎరిగిన మొహమల్లే ఉంది—ఎవరా, అని గుమ్మంలో నిలబడి చూస్తూ నిల్చుండిపోయాడు, నారాయణబాబు. — కమల లోపలకొస్తోంది. ముత్తవతల్లి ఎదురొచ్చి "ఎంత చిక్కిపోయావే బుచ్చితల్లీ" అంటూ తల నిమిరింది. సూట్ కేసూ, హోల్డాలూ హ్యాండ్ బాగ్గూ బెంచీ మీద పడేసి మొకమల్ స్లిప్పర్లు విడుస్తూ "ఎప్పుడొచ్చినా అమ్మ చిక్కిపోయానంటుం దేవిటే నాన్నా" అని కిలకిలా నవ్వింది కమల.

నారాయణబాబు అడుగుదామా వొద్దా అని పస్తాయిస్తున్నాడు. కాని టెన్నిస్ రాకెట్ చేతికందిస్తూ కమల తనకు తానే చెప్పింది.

"ఆయన్నెరుగుదువా నాన్నా - భాస్కరరావు—చంద్రంగారబ్బాయిట—మనవూరేట నాన్నా..."

"సరిసరి చంద్రశేఖరంగారి అబ్బాయా? అవునవును—అతనూ మీ కాలేజీలోనేగా చదువుతుంటా"

గుర్తుకొచ్చింది నారాయణబాబుకి. కాని ఇది పరిచయమా? స్నేహమా? ఎన్నాళ్ళనించీ అన్న మీమాంస తెక్కుండా వొచ్చిం దతనికి. "నాకూ తెలియదు నాన్నా—ఇవ్వాళ ట్రెయిన్లో ఫస్ట్, సెకండ్, క్లాసులలో సరేసరి సీట్లు ఖాళీ లేనేలేవు. ఇన్టర్ లో కూడా చెడ్డ 'రష్'గా ఉంటేనూ చాలా సాయపడ్డారు పాపం. 'ఇంటిదగ్గర దిగవిడిచి వెడతాను' అంటే కాదనలేకపోయాను. వాళ్ళయింటికి మన మేడమీదుగానే వెళ్ళాలిగదా ఒకే జట్కాలో వచ్చేం నాన్నా" అని ఒక్క బిగిని, ముందస్తుగా సేకల్పించి కంఠస్థం చేసినపాఠమేదో వొప్పగిస్తున్నట్టు, అడగని పంజాయిషీ అప్రయత్నంగా ఇచ్చేసింది కమల.

"చిన్నప్పుడు చూశావితన్ని—జులపాలూ, ముచ్చటముడీ— కలిజాగా వుండేవాడు. ఇప్పుడు నేకరం లేరాడు—నాజూ కమిరింది—చక్కా పుష్టిగా—బొద్దుగా—"తక్కింది తల పంకింపుతో పూర్తిచేసి ముసిముసిగా నవ్వుకున్నాడు నారాయణబాబు.

బావుంది వరస! కమల సిగ్గుపడింది.

మర్నాడు వుదయం కాఫీ గట్రా సేవించి డబ్బులు చెల్లించేందుకు భాస్కరం పర్సు తడుముకొంటోవుంటే 'కౌంటరు' దగ్గర నారాయణబాబు అవుపించాడు.

భాస్కరరావు నిర్ఘాంతపోయాడు. అతని కర్థమయింది. కమల భవానీ కేఫ్ ప్రొప్రయిటరు కూతురన్నమాట—నిన్నంతా ట్రెయినులో అంతసేపు ఇష్టాగోష్ఠిలో వున్నా కమల ఎవరో తెల్సుకుందామనే ఆత్రమే లేకపోయింది. అసలా అమ్మాయి ఏమి చెబుతోందో వినాలనే తోచలేదు తనకి. ఎంత ముద్దుగా, ఎంత అందంగా, ఎంత శృంగారంగా మాట్లాడుతోందో, పలికే పలుకులో ఆ అమ్మాయి చిరునవ్వు తళుకెంత కలిసిపోతోందో ఆరాలు చూచుకోవడంతోనే సరిపోయె. మొత్తంమీద కమల మంచి రూపసి! ఆమెని చూచిన దగ్గరనించీ ఆమె లావణ్యం అతని రక్తాన్ని గిలకొడుతూనే వుంది.

రాత్రి డాబామీద పక్కెట్లో వొంటరిగా పడుకుని నెమరుకి తెచ్చుకుంటున్నాడు. కృష్ణకాలువలో తెప్ప గలగల వినిపిస్తోంది. కమల మాట్లాడుతోంటే సరిగ్గా అల్లాంటి గలగలే మోగినట్టు గుర్తు—ఆకాశంమీద మబ్బులు పింజెలు పింజెలుగా గంభీరంగా నడుస్తున్నాయి. స్త్రీ 'గజగమన', 'హంసయాన' అన్నారు గాని కవులు, కమల నడిస్తే మబ్బులు గంభీరంగా ప్రయాణం చేసినట్టుంటుంది—పరిమళమేదో ముందుకి ప్రవాహంగా సాగినట్టుంటుంది—ఒకటే ధ్యాస—ఆమెలో ఏదో ఒక వింత ఆకర్షణ అతన్ని గజిబిజి చేస్తోంది.... ఖండితంగా మాట్లాడుతుంది. మాటలలో వెకిలితనం లేదు. నిర్భయంగా నిర్మలంగా చూస్తుంది. చూపులలో దొంగతనపు తీరయినా వుండదు. ఎంతో సహజంగా సిగ్గుపడుతుంది. ఆ సిగ్గులో నేరం కనిపించదు—సరిపోయింది—తెల్లవారేటట్టుంది. పక్కెట్లో చలి వేస్తుందేమోనని శాలువా తెచ్చుకున్నాడు పైకి— ఉక్కపోస్తోంది ఎదురు. అనుకొన్న టయిముకి "షా" నాటకాల సీరీస్ లో మొదటి వాల్యూము లైబ్రరీనించీ తీసికొని చక్కా వెళ్ళాడు. కమలకిద్దామని, మొదటి వాల్యూ మయింతరువాత రెండో వాల్యూ మెట్లాగూ అడుగుతుంది. తరవాత సరే మూడూ, నాలుగూ...ఒకసారి అనుకున్నదల్లా మూడుసార్లు, నాలుగుసార్లు కమలను కలుసుకొనే అవకాశాలు ఒకదాని తరవాత ఒకటి గొలుసు కట్టుగా లభించే వీలూ పాలూ అంతా స్టడీ చేసుకొనే బయలుదేరాడు. తీరా మెట్లెక్కుతుంటే నారాయణబాబు చిరునవ్వుతో ఆహ్వానించాడు—సరిపోయింది—కాయ నింకా కేఫ్! వెళ్ళే

లేదన్న మాట—పక్కని రిసెంషు రూములో కూచున్నా రిద్దరూను. అటూ, ఇటూ, సోఫాలు, మధ్య టేబులుమీద 'క్రైనావేస్'లో గులాబీ రెమ్మ, 'బుక్ షెల్ఫు'లో లైనుగా అమర్చిన పుస్తకాలూ, గట్రా...బావుంది—చక్కా నీటుగా...స్ప్రింగ్ కుషన్లో కూచుని సీలింగ్ వంక చూస్తున్నాడు భాస్కరం. నారాయణబాబు కాలేజీ వ్యవహారాలేవో భోగట్టాలు అడుగుతున్నాడు. పొడిగా, క్లుప్తంగా, సమాధానాలు చెప్పుకొంటో పోతున్నాడు భాస్కరం.

మళ్ళీ అందులో తను శాఖా చంక్రమణాలూ గట్రా చేస్తే సంభాషణకి చిలవలూ, పలవలూ, మొలిచి ఇహ తెములదేమోనని భయం. అసలు తను అంత పెందరాళే రావడమేమిటి? గడియారంతో పందెం వేసికొని పరిగెత్తుకొచ్చినట్టుంది. ఇంకా ఏడు కాలేదు. ఎంతో ఎండెక్కిపోయినట్టనిపించింది.

"ఈ పుస్తకమేనా మా అమ్మాయి కావాలంట?"

అని చేతిలోవున్న పుస్తకం చటుక్కున తీసికొన్నాడు నారాయణబాబు—కొంప మునిగింది! అంత ప్రమాద మొస్తుం దనుకోలేదు భాస్కరం.

తీరా పుస్తకం ఆయన చేతికిచ్చింతరవాత ఆయ నెట్లాగూ కమల కిస్తాడుగా—తా నింకా వుంటం దేనికని? ఏ వంక పెట్టుకొని చక్కా వచ్చాడో ఆ వంక కాస్తా పూడి చక్కాపోయింది. లేచాడు. "పుస్తకం కమల కిచ్చెయ్యండి" అని చెప్పి ఏదో అర్జంటు పనివున్నట్టు వెళ్లి పోబోతున్నాడు కొంచెం మొరటుతనంగా. ఆపినా ఆగలేదు—నారాయణబాబు యథాలాభంగా పుస్తకంలో పేజీ లటూ యిటూ తిరగేశాడు. మొదటి పేజీలోనే నీలైన బ్లాటింగ్ పేపర్ మీద ఒక చిన్న వుత్తరం భద్రంగా మడిచిపెట్టి వుంది. ఆ ఉత్తరం కమల పేరనే వ్రాసివుంది. అతని మొహం జేవు రించింది—కోపాలూ చదివాడు—కొంచెం శాంతించాడు. మరీ జాలాయిరకం గాలేదు. ఆ ఉత్తరంలో బాధ్యతతో కూడుకున్న ప్రణయతత్వం అంతో యింతో గోచరించిం దతనికి. ఏమను కొన్నాడో, వుత్తరం ఏ పేజీలో వున్నదా పేజీలో ఎట్లావున్న దట్లా జాగ్రత్తగా వుంచేసి కమలకిచ్చి వెళ్ళిపోయాడు.

చెల్లాయి మారాముచేస్తే తీసుకుని సినిమాకి వెళ్ళాడు భాస్కరం. తలవని తలంపుగా కమలా వచ్చింది సినిమాకి. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు చూచుకొన్నారు. ఫలితం అవ్వాళ ఇద్దరూ సరిగ్గా సినిమా చూడలేదు. చెల్లాయి కటు కమలా ఇటు తనూ కూచున్నారు. రిజర్వులో—సినిమా ఆఖరు రీలు మొదలయింది—లైట్లన్నీ ఆరిపోయినై—సోడావాళ్ళ కేకలు సద్దుకొన్నాయి. కమల చల్లని కంఠస్వరం చెల్లాయి తలమీదనించీ చెవిలోపడింది భాస్కరానికి. "పుస్తకాలలో వుత్తరాలు పెట్టకండి తప్పు" అన్నది కమల. భాస్కరం వులిక్కిపడ్డాడు. చీకట్లో ఆమె కళ్లు కాంతిగా మిలమిలలాడాయి. "అల్లరి పెట్టాలని వుద్దేశ్యం నాకు లేదు క్షమ్మ" అని పూరేడు. "అయితే మా నాన్నగారితో మాట్లాడండి—సరేనా?"

"నీ విష్టపడితేనే"

"మాట్లాడండి—తప్పదుగా"

గప్పున లైట్లు వెలిగాయి. చెల్లాయి చెయ్యిపట్టుకొని భాస్కరం లేచాడు. చీకట్లో ఎవళ్ళతో వని వాళ్లు పోతున్నారు. చుక్కలు చక్కలిగింత పెట్టా యిద్దరినీ.

సెలవలలో బద్ధకమెక్కువ. మధ్యాహ్నం వో నిదరతీసి లేచి మొహం కడుక్కుని టీకని థర్మాస్ఫ్లాస్కిచ్చిపంపి తలగడామీద మోచెయ్యి ఆనించి చిన్నకథల పెద్దపుస్తకం చివర పేజీ ఆవలిస్తూ తిరగేస్తున్నాడు భాస్కరం. "కులాసాగా వున్నారా?" అని పలక రించాడు నారాయణబాబు. భాస్కరరావు కలవరపడ్డాడు. వుత్తర మాయన కంటబడిందా కొంపదీసి? కంప్లెయింటు చేదామని వచ్చేడా? ఇంతా చేసి చంద్రంగారికోసం వచ్చాడేమో తన ఖంగారే కాని, "చంద్రంగారు కోర్టు పనిమీద వెళ్ళారు. కూచోం డ"ని పడకకుర్చీ చూపించి ఇష్టాగోష్ఠిలో ఆయన్ని మరిపించట మెట్లాగా అని మథనపడుతున్నాడు భాస్కరం.

"నువ్వు మా అమ్మాయికి వ్రాసిన ఆ ఉత్తరం చదివానోయ్ భాస్కరం" అన్నాడాయన హఠాత్తుగా. భాస్కరానికి గుండె ఆగింది. సంజాయిషీ అడుగుతాడా? ఏమి చెప్పాలి? కళ్ళ యెదుట స్టూలుమీద స్పష్టంగా అవుపిస్తూవుంటే ఎక్కడో పడిపోయిం దను కొన్న పెన్సిలుకోసం రగ్గు మడతలలోనూ తలగడా కుచ్చిళ్ళలోనూ చకచకా వెతికేస్తూ వినిపించుకోనట్టు నటిస్తున్నాడు భాస్కరం.

"కాని నువ్వు సీరియస్ గానే వ్రాశా వనుకుంటున్నాను నేను" తీక్ష్ణంగా చూశాడు నారాయణబాబు.

"నాకు మరో ఉద్దేశ్యం లేదండి" ఏదో అనేస్తే సద్దుకుపోక పోతుందా అని తాపత్రయపడుతున్నాడు భాస్కరం.

"నువ్వు చదువుకున్నవాడవు. బాధ్యత ఎరిగున్నవాడవు. అంచాత ఏదో అల్లరిచిల్లరగా కాకుండా సక్రమమైన వాంఛనే వెల్లడించావనీ, నీకు మరోక దురుద్దేశ్యం లేదనే నాకూ అనిపిం చింది. చెప్పొద్దూ—అదే నీముఖతా తేల్చుకుందామని వచ్చాను. నేనెంతవరకు సరిగ్గా వూహించగల్గిందీ నువ్వే చెప్పాలి" అని వొది లేశాడు నారాయణబాబు.

అమ్మయ్య! కొండంత బరువు దించేసినట్టయింది భాస్కర రావుకి. అతని కర్థమయింది.

"ఆ ప్రస్తావన ఎట్లాగూ వచ్చింది గనుక స్పష్టంగా చెప్పే స్తున్నాను. నాకు నిజంగా కమలని వివాహంచేసికోవాలనే వున్న దండి" అని తల వంచుకొన్నాడు భాస్కరం.

"నీ కిష్టమే కావచ్చు—కాని మా........."

"నా కిష్టమయిం తరవాత ఒకళ్ళ ఇష్టానిష్టాలతో నాకు పని లేదు."

అతని నిర్లక్ష్యాన్ని గుర్తుపెట్టుకొంటున్నాడు నారాయణ బాబు.

"నీకు లెక్క లేకపోవచ్చు, కాని......

"కట్నాలతోటీ కానుకలతోటీ నాకు ప్రసక్తి లేదు."

"అవన్నీ నాకు వొదిలేసెయ్—మీ నాన్నగారితో నేను సంప్రదిస్తాగానీ—మూశావూ భాస్కరం—కమల నాకు ఏకైక సంతానం నీకు తెలుసునో లేదో—అది తల్లిలేని పిల్ల—దానిని కంటికి రెప్పలా ఎంత అల్లారుముద్దుగా పోషించుకుంటూవచ్చానో భగవంతుడికే తెలుసు. దానిని ఒక అయ్య చేతిలో పెట్టేముందు అభిమానంగా చూచుకునే అత్తమామలూ ఆడబిడ్డలూ ఆదరణ చూపే బంధుకోటీ కావలసిన అగత్యం నాకు సహజంగా వుంటుంది. నీవింటి అభ్యంతరాలు లేవని అనిపించుకోవాలనే మాత్రమే నీదగ్గర కొచ్చాను."

"నా కిష్టమే"

నారాయణబాబు వెళ్ళిపోయాడు.

పర్యవసానం ఇంత సుళువుగా ఇంత తృప్తికరంగా ఫైనలయిపోతుందని భాస్కరరా వనుకోలేదు. అతనికి నిజంగా ఆనందం పుక్కిలింతలయింది. కాని ఇలా వొస్తుం దనుకోలేదు—ఉత్తరాలూ, పత్తిరాలూ, ప్రత్యుత్తరాలూ, సంకేతాలూ, సమావేశాలూ, నిరీక్షణలూ, నివేదనలూ, ఒక టేమిటి ఎడతెగని ప్రేమ లేఖల పరంపర! అతను వూహించుకొన్న శృంగార చిత్రమంతా మనస్సు మజిలీలన్నీ దాటేసి విచిత్రమైన 'బిజినెస్' లోకి దిగి వచ్చి వూరుకుంది. సరిపెట్టుకోక చేసేదేముంది? కాని అతనికి జంకు లేకపోలేదు. ఆలోచనకి అవకాశ మివ్వకుండా వొచ్చాడు నారాయణబాబు. ఏదో గండం తప్పుతుంది గదా అని పెళ్ళాడతావని ఫెడీమని అనేశాడా?...ఎట్లాగూ కమల కొంచెం తెలుసు.—చదువుకొన్న పిల్లని పెళ్ళిచేసుకోవాలనే వుంటుంది కాని పెనిమిటంటే దైవసమానంగా చూచుకోవడమూ భర్తమాట వేదాక్షరంగా పాలించటమూ ఇత్యాది సుగుణాలమీద మమత్వం అతని ఎముకలలో జీర్ణించిపోయివుంది. అతని నిర్ణయం సందేహ తరంగాలమీద కొంచెంసేపు అటూ యిటూ వూగిసలాడి ఆఖరికి వొడ్డున చతికిలబడింది—చట్—చదువూ సంధ్యా లేని ఒక మొద్దు చేత చాకిరీ చేయించుకోటంకంటె కమలలాంటి సౌందర్యవతితో విజ్ఞానవతితో కలహించినా ఆహ్లాదకరంగా వుంటుంది అనిపించింది భాస్కరరావుకి. ఇహ మనస్సుని ఆ తర్కం లోతికి పోనివ్వదల్చుకోలేదు. పైగా కాసులలో మంచి చేతుల్లో పెడతారు పిల్లని.

పెళ్ళిమాపులయినాయి—కట్నాలూ లాంఛనాలూ వారడిగినంతా, వీ రిచ్చినంతా—ప్రధానమయింది కోడలు వజ్రపు తునకలా వుంటుందని మురిసిపోయింది భాస్కరం తల్లి. "మీ యింటికి వెలుగొస్తుందోయ్" అని చంద్రంగారి భావమరిది పరిహాసం చేశాడు. కమల పరీక్షా ఫలితాలకి ఎదురుచూట్టం మానుకుంది.

కమల నాయనమ్మకి పట్టశక్యంకాకుండావుంది. అమ్మలక్కలతో అశ్రేపసంగ మాపెడు.

రాత్తిరి వంటయిల్లుకడిగి పాలలో తోడుచుక్కవేసి వెళ్ళిపోతోంది చంద్రశేఖరంగారివంటలక్క సుభద్రమ్మ. సకాలంలో పెళ్ళిపనులు ప్రారంభించాలనీ, పప్పులువెయ్యటానికీ, కారాలు కొట్టడానికీ పనిమనుషుల్ని చూడాలనీ చెబుతున్నారు చంద్రంగారు. వెడుతూవున్నదల్లా ఆగి "అబ్బాయికి మా అన్నయ్యగారి సమంధం రైటయిం దనుకున్నారు. నిజమేనాండి బాబూ!" అని నిలబడిపోయింది సుభద్రమ్మ. ఆ ప్రశ్న తప్పించి—"నమ్మకమైన వాళ్ళనిచూడాలి—పనులు చురుగ్గాసాగాలి—ముహూర్తం బహుశా ఫాల్గుణంలోనే వస్తుంది" అని పైకిచూచి దాదా మెట్లెక్కిపోతున్నారు చంద్రంగారు. భాస్కరానికి ఇంకా నిదరపట్టలేదు, తను కవటాకులు నములుతో, వగమయిన విల్స్ సిగరెట్టు పారెయ్యలేక పిట్టి అరుగుమీద కొంచెంసేపు విశ్రాంతిగా కూచున్నాడు. సుభద్రమ్మ లాంతరు స్తంభందాకా వెళ్ళిపోయింది. వెనక్కి తిరి చూడు. వొచ్చింది.

"మీ అన్నయ్యగారిసమంధమంటావేమిటి?" బానీ పెట్టి మీదవున్నవాడల్లా గొంతుకూర్చుని రహస్యంగా అడుగుతున్నాడు భాస్కరం—ఏదో అనుమానం పాలీడు బూజులా పట్టుకుందతన్ని.

"నారాయణబాబూ మేమూ పెత్తండ్రి పింతండ్రి బిడ్డలం కదండీ" అన్నది.

"అంటే మీ తండ్రులిద్దరూ సయానా అన్నదమ్ములన్నమాటేనా?"

"సయానా"

"వినలేదే" అంటూ కూచుండిపోయాడు భాస్కరం.

"ఎందుకు వింటారు బాబూ—చెప్పుకుంటే మాకు ప్రతిష్ఠ అతనికి ప్రతిష్ఠా—మాకూ అయిశ్వర్యముంటే మేమూ చెప్పుకొందుము—అతనూ చెప్పుకునేవాడు."

సుభద్రమ్మ వెళ్ళిపోయింది. భాస్కరరావు ఆలోచనలో పడ్డాడు. ఇదెక్కడి సంప్రదాయం? అవ్వేళ సరిగ్గా నిద్దరపట్టలే దతనికి.

మర్నాడు పార్కులో స్నేహితుల మధ్య ఆ ప్రస్తావన వచ్చింది. అంతా సరిగ్గానే మాట్లాడారు నిజానికి. కాని ఒకళ్లిద్దరు మాత్రం ఏదో సూటిపోటీగా అంటున్నా రనుకుని, లేని అర్థాలు కల్పించుకుని బాధపడుతున్నాడు భాస్కరం—అందులోనూ శంకరానికి ఎంత తోస్తే అంత. "జమీందారు బాలంగారి మేనల్లుడికి, దొరక్క దొరక్క చివరికి వంటపూటి సమంధం దొరికిం దన్నమాట." అన్నాడు ఫెడీమనివాడు. అని వూరుకోక "డబ్బురా నాయనా, డబ్బు, డబ్బు" అంటూ న్యూస్ టయిమయిందని మునిసిపల్ రోడ్ స్పీకర్లవంక తొరతొరగా వెళ్ళిపోయాడు. భాస్కరరావు తల వంచుకుని కుండీలో నూరు వరహాల చెట్టు తుంచుతున్నాడు. స్నేహితులు సంభాషణ మార్చారు.

రెండు రోజులదాకా భాస్కరరావు ఎక్కడికీ వెళ్ళలేదు. సాయంత్రం జనం ముసలనిచోట, లాకుల కెగువని, తమ్మిలేటిగట్టున చల్లగాలి సేవించి చీకటిపడిం తరవాత ఇంటికొచ్చాడు. ఇంటిదగ్గర గలభాగా వుంది. దక్షిణపు గదిలో ఇనప్పెట్టిదగ్గర కవిలెకట్ట చూస్తున్నారు చంద్రంగారు. చంద్రంగారికి వడ్డీవ్యాపారం. వసారాలో గదిగుమ్మందగ్గర నుంచుంది నూకమ్మ. నూకాలు నారాయణబాబుగారింటో పనిమనిషి. నూకమ్మ తన చినతమ్ముడికి జబ్బుగా వుంది,

రూపాయికి రోజుకి కానీ చొప్పున వడ్డీ నిర్ణయించుకొని, రెండు తులాల రాగిడీ రెండు నెలలకి లోపాయికారీగా తాకట్టుపెట్టి 15 రూపాయలు పట్టుకెళ్లింది చంద్రంగారిదగ్గరనించి. వ్రాత కోతలు లేవు. పత్తిరం వ్రాయాలనంటే రెండు తులాల తాకట్టు చాల దన్నారు చంద్రంగారు. వాయిదా నాటికి సొమ్ము చెల్లించకపోతే మటుకు తాకట్టు వాకట్టని వరకు. యింగ్లీషు లెఖ్ఖ ప్రకారం రెండు నెలలూ చూచి నూకమ్మ ఎంతకూ రాకపోతే రాగిడీ అమ్మేశానంటాడు చంద్రంగారు. అమావాస్య వెళ్లిన దగ్గిరనించీ తెలుగులెఖ్ఖ ప్రకారం రెండునెలలూ అంచనా వేసుకుని రాగిడీ అమ్మిన మర్నాడే వచ్చింది నూకమ్మ, అప్పుతీర్చి వస్తువు తీసి కెడదామని. అదీ ఘర్షణ.

"నూకమ్మా నిన్ను నేనేమీ అన్యాయం చేయలేదు. నీకు తెలియకపోతే ఎవళ్లనైనా పెద్దమనుషుల్ని అడుగు. వడ్డీ లెఖ్ఖలకి ఇంగ్లీషు మాసాలు చూస్తారుగాని తెలుగు నెలలు బద్ధంపు వేస్తారా ఎక్కడయినా! అందరికీ ఒక లెఖ్ఖ నీకొక లెఖ్ఖ కడతానా! నాకయినా నిజంగా ఫాయిదాలో కలిపి అంచనా వేసుకుంటే వకటి రెండు రూపాయలు తక్కువే కిట్టాయి. నమ్ము నమ్మకపో. అనాడు గంగిగోవులా తలవూపిన కంసాలి వీరభద్రయ్యే ఇవాళ బంగారం జబ్బుదనీ మచ్చిబంగారంకన్న నాసిగా వున్నదనీ దప్పరించాడు." అని ప్రశాంతంగా జవాబిస్తున్నాడు చంద్రశేఖరంగారు. నూకమ్మ బుడిబుడి దుఃఖాలు సాగించింది. వస్తువు యింట్లోనే వున్నదని ఆమెకు గట్టి నమ్మకం. కొంచెంసేపటికి పాకం ముదిరింది. ఎవరి కమ్మావో ఆ ఆసామీనే వెళ్లి ప్రాధేయ పడతాను. ఎవరో చెప్పమని నిగ్గతీసింది. దానికి చంద్రంగారు అవుకి అందకుండా పోకకి పొందకుండా సమాధానాలు చెపుతుంటూ పోతున్నాడు. తాకట్టు వాకట్టయింతరవాత ఎవరి కమ్మింది ఎంత కమ్మింది చెప్పాలిసిన అగత్యం తనకి లేదని, తన యిష్ట మెచ్చినవాళ్లకి, ఇష్టమెచ్చినంత కమ్ముకునే హక్కు తనకి వున్నదనీ కచ్చితంగా మాట్లాడుతూ చేతిలోవున్న దస్తరం నేలకేసి కొట్టాడు చంద్రంగారు. దానితో నూకమ్మ రెచ్చిపోయింది. ఆమైన నిప్పులు గక్కుతూ కొప్పుముడి విడిపోతుంటే వారలు దాపుకుంటూ శోకాలు పెడుతో పొళ్లెరగని కోపంతో నిర్ధారణ చెయ్యడానికి వీలులేని కంఠస్వరంలో "తినవయ్యా తిను—నా సొమ్మే తినవయ్యా నువ్వు—పదిరూపాయలు చేతిలోపెట్టి రెండు తులాల బంగారం మింగేస్తావటయ్యా నువ్వూ—నా వుసురు నీకు తగలకుండా పోతుందాంట! కొంపలో మళ్లీ పెళ్లి పెటాకులూ చేసుకోబోతున్నావాయెను—పైనించీ లక్షలు కొంపమీదికి వేసుకుంటున్నా ఎంగిలికూటికి ఎగబడతావెందుకయ్యా నువ్వు! నీ యిదాన్ని నే నెన్నిసార్లు ఎంతవడ్డీ పొయ్యలేదు!-నన్నే ఏడిపించాలటయ్యా! నా పొట్టమీదనే కొట్టాలిటయ్యా" అని పొలికేక లేస్తూ వీధినపడింది. వసారాలో ఇందాకా నిశ్శబ్దంగా కూర్చున్న భాస్కరం చప్పున లేచి అటకాయించి "అగు భడవా—నీకు అన్యాయం జరిగితే కోర్టులో దావా వేసుకో. అంతేగాని మాటలు మిగిలాతంటే లాకప్‌లో పెట్టిస్తాను జాగర్త" అని ధిమాకీ చేశాడు.

కలిగినవాళ్లకి అన్యాయం జరిగితే ఏ కచేరీలోనో ఏ వ్యవహారంలోనో ఎక్కడో వొకచోట వొక్క ప్రతీకారం చేస్తారు. అన్యాయంగాని దానికి ప్రతీకారంగాని జరిగినట్టు రెండో కంటి వాడికైనా తెలియదు. కాని అలగా జనానికి కించిత్తు అక్రమం జరిగిందంటే వాళ్లు ఎట్లాగూ ప్రతీకారం చెయ్యలేరు. కాని వాళ్ళకు చాతనయిందల్లా యాగీ. అది ఎంతమంది నోళ్లల్లో పడితే అంత తృప్తి వాళ్ళకి. అంచాత పనిమనిషికిగాని, పాకీదానికిగాని, బిచ్చగాడికిగాని కష్టం కలిగిందంటే వాడవాడంతా మోగిపోతుందంతే! కాని మోగటం మటుకే!!

రాత్రి భోజనాలప్పుడు మళ్లీ ఆ ప్రస్తావన రాలేదు. భోంచేసి తీరికగా దొడ్లో చామంతి మడిదగ్గర పైరగాలికి మడతమంచా లేసుకుని ఇష్టాగోష్టిలో పడ్డారు తండ్రీ కొడుకు లిద్దరూ—భాస్కరరావు అందుకున్నాడు.

"అయితే నాన్నా కొన్నేళ్లక్రితం బహదూర్ మామయ్యగారింట్లో వంటపని చేశాడా నారాయణబాబు?" జమిందారు బాలంగారికి రావుబహదూరు బిరుదున్నది. ఆయన్ని బహదూర్ మామయ్య అంటాడు భాస్కరం.

"అక్కడ చేశాడో లేదో నాకు గుర్తులేదుగాని, ఇతర్త్రా వంటపనులు చేసినవాడే నారాయణబాబు—నీకూ తెలుసుగా—"

"మరి ఈ అయిశ్వర్య మెట్లా పట్టెం దతనికి?"

"నారాణబాబు పాపం చిన్నతనంలో చాలా పేదరికం అనుభవించాడు. ఇప్పటి ఆస్తిఅంతా అతని స్వహస్తాలమీద ఆర్జించిందే. వంటపని చేసీ చేసీ విసిగి ఆఖర్న మద్రాసులోనూ, బెంగుళూరులోనూ తనకింద మనుషుల్ని పెట్టుకుని పెద్ద హోటలు వోపెన్‌చేశి పికిల్ సాపింగు నేర్పుగా సాగించీ చాలా ఆర్జించాడని వినికిడి"

"పికిల్ సాపం టేటి?"

"అప్పట్లో అక్కడవున్న మన ఆంధ్రాస్టూడెంట్సుగట్టా వూరగాయలకి మొహంవాచిపొయ్యేవాళ్లట. వాళ్లకని గోంగూర పచ్చడీ, చింతకాయపచ్చడీ, వూరగాయలూ గట్టా అన్నీ బాటిల్స్‌లో ప్యాక్ చేసి పెద్దవ్యాపారం సాగించాడీయన, ఇక్కడ కొచ్చిన పదిహేనేళ్లనించీ హోటలూ, బోర్డింగూ, లాడ్జింగూ తెరిచి డబ్బు చేరలకొద్దీ సంపాయించాడు. షుమారు పదిలక్షలదాకా వుంటుంది. చాలా మంచివాడు పాపం. అతని సత్ప్రవర్తనా, అతింపోదా, అతని దర్జా ఇపుడుచూస్తే ఒకప్పుడితనేనా గరిట పట్టుకుని హీనంగా బ్రతికినవాడనిపిస్తుంది."

"అయితే ఇట్లాంటి నిదమైనసమ్మంధం మాస్తావా నాకు"

"నేనా ఈ సమ్మంధం మాస్తా నీకు?"

భాస్కరరావుకి వొళ్లు తెలియటంలేదు. అసలీబురదలోకి మొట్టమొదట అడుగుపెడతా తనే అన్న సంగతి మరిచిపోయాడు.

"నేను తెలిసుంటే దిగా వసుకుంటున్నావా?

"తెలియదని ఎట్లా అనుకోను—ఈవూళ్లోపుట్టి, ఈవూళ్లో పెరిగి మన పొరుగువీధినవున్న ఆసామీ పుట్టుపూర్వోత్తరాలు నీకు

తెలియకుండా కూపస్థమండూకంలావున్నావని కలగన్నావా! పోయి అడుగు మెడకాయమీద తలకాయివున్నవాడికల్లా తెలుసు"

"ఏమిటేమిటి? పోనీ తెలిసే నే నంగీకరించాననుకో. నువ్వు చెప్పక్కర్లే నాకు? సమంధ మెట్లావున్నా సంప్రదాయం కావాలి కావాలని దొంగలు కొరుస్తూ చెప్పేనువ్వు—మంచిసంప్రదాయం గలకుటుంబమైతే చాలు పిల్లని సయితం చూడనక్కర్లేదు—కట్నం చిల్లిగవ్వయినా కాంక్షించను అని రొమ్ము విరుస్తూ ప్రగల్భాలు పలికే నువ్వు—అబ్బాయీ ఇది ఇట్లాంటిసమంధం. అని నాతో చెప్పనక్కర్లేదా?"

"చెప్పలేదు. నా కభ్యంతరంలేదు కాబట్టి"

"నీ కభ్యంతరంలేదూ?" నువ్వు వియ్యమందబోయేవాళ్లు దంటమనుషులయినా అడుక్కుతినేవాళ్లయినా నీకు నిమిత్తం లేదన్నమాట."

"ఆ పని ఇప్పుడు చెయ్యకుండావుంటే చాలు."

భాస్కరానికి రగులుకుంటోంది లోపల. కాని అతనికి తెలుసు చంద్రంగారు హెచ్చితే తగ్గుతాడు—తగ్గితే హెచ్చుతాడు.

"అయితే మొన్న నామనస్థ లక్కవరంనించీ వో సమంధం వస్తే వాడి పింతల్లి మేనల్లుడు కాలంనాడు నిడదవోలు పడవల రేవులో జంతికలమ్మాడనీ, వాడి పినతండ్రి కొడుకు గుండుగూరు సంతలో కొలగారం చేసేవాడనీ, నెరుసు లేరి ఆ సమంధం తిరగ్గొట్టా వెందుకని?"

"వాళ్లకు డబ్బు లేదు కాబట్టి"

"అయితే డబ్బు చూచుకునే నారాయణబాబుగారి సమంధం రైటుచేశావన్నమాట?"

"ఇందులో నేను చూచుకొన్న దేమీ లేదురా అబ్బాయీ—కట్నంకూడా అంతనీ యింతనీ నేను మొరాయించలేదు"

"మాటల కేమిలే—నారాయణబాబుకి కమల వొక్కతే కూతురని తెలియదా యేం నీకు?"

"అది నాకంటే నీకే ఎక్కువ తెలిసివుండాలి మరి."

భాస్కరరావుకి కొరడాతో కొట్టినట్టయింది.

"అయితే అబ్బాయీ—ఈ ప్రశ్నలన్నీ నీకు ఎవరు నూరి పోశారురా?"—అన్నాడు చంద్రంగారు, ఇక సంభాషణ తను నడపాలన్న సంకల్పంతో.

"నువ్వనుకోవడం, మనం నారాయణబాబు డబ్బుకోసం ఎర వేసుకుని కూచున్నామనీ జరిగిన తతంగమంతా దానికోసం పన్నిన పన్నాగమేగా!"

"అందుకు సందేహమా?"

"ఇందులో నారాయణబాబు స్వార్థం ఏకోశానా లేదనే నీ వుద్దేశం—అవునా?"

"ఆయన తప్పేముంది. కమల నేనంటే ఇష్టపడింది అంచేత నిన్ను కదిపాడు—నువ్వు సరే నంగిగోవులా తలవూపేశావు."

"తప్పు కాదురా నాయనా—ఈమాత్రం చదువుకున్న చదువూ ఈమాత్రం ఆస్తిపాస్తులున్న సమంధమూ నారాయణబాబుగారికి రాకపోలేదు తెలుసునా! అతనూ సంప్రదాయమైన కుటుంబంలో పిల్లని పడెయ్యాలని ఎంత తాపత్రయపడ్డాడో సులభంగా అర్థమవుతుందా? నీ వూహ కందలేదింకా! జమీందారు బాలంగారి మేనల్లుడుగాని అతనికి నచ్చలేదు తెలుసా?"

"అందులో అతని తప్పేముంది? కంటవూట బ్రతుకు బ్రతికినా అతనికి సంప్రదాయంగల కుటుంబంలో, పిల్లని పడెయ్యాలన్న జ్ఞానం వుంది—మనమంటే గడ్డి కరవడానికి సిద్ధమయ్యాం కాని..."

"అక్కడే పొరపడుతున్నావు నాయనా—సాంప్రదాయమైన సమంధాలకోసం పాకులాడవలసిన ప్రారబ్ధం మన కేమిట్రా? ఆ సంప్రదాయం మనకుందిగా?"

"అయితే ఆ ప్రారబ్ధం నారాయణబాబుకి పట్టిందంటావు? మనకేమో డబ్బున్న...."

"మనం వెతుక్కోలేదు. కావాలని డబ్బున్న సమంధాల కోసం వెతుక్కోవడం నీచం. వెతుక్కోకుండా వొళ్ళో వాలి నపుడు పెడమొహం పెట్టుక్కూచోవడం తెలివితక్కువ. పైగా ఇందులో తప్పేమిటో నాకు గోచరించడంలేదు. అతని క్కావలసిన సంప్రదాయం మన దగ్గరుంది. మనక్కావలసిన డబ్బూ దస్కం అతని దగ్గరుంది. ఈ సమంధంతో అది మనకీ, ఇది అతనికీ సంక్రమిస్తుంది. అతని డబ్బుకోసరం మనం పాకులాడు తున్నామనుకునే బదులు మన సంప్రదాయంకోసం అతను పాకు లాడుతున్నా డనుకోరాదూ?"

భాస్కరరావు బి. యే లో 'లాజిక్కు' తీసుకున్నాడు, కాని తర్కంలో ఈ వింతపోకడ లింకా అతని బుర్రదాకా రాలేదు. అతనికి విసుగ్గావుంది.

"ఏది ఎట్లావుండనీ—సంప్రదాయంలేని కుటుంబమని తెలిసీ కూడా డబ్బుంది కదా అని జొరబట్టం నీచం" అన్నాడు భాస్కరం.

"అట్లాగే డబ్బు అంత లేదుగదా లొంగిరాకపోతాడా అని సంప్రదాయమైన కుటుంబాలలోకి జొరబడాలని చూట్టం ధనికుడికీ నీచమే. నువ్వనే నీచం ఉభయత్రావుంది. ఒరే అబ్బాయీ నీ కింకా ఈ ప్రపంచంలో విలువలు తెలియవు. డబ్బున్నవాడికి ఇవాళ కాకపోతే రేపు వస్తుంది సంప్రదాయం. అయితే ఎవడో వొకడు ఆ ముద్ర వేయడానికి పూనుకోవాలి. ఆ ముద్రాధికారం ప్రథమంలో ఎవడు తీసుకుంటాడో ఎవడు తీసుకుందుకు సాహసిస్తాడో వాడికి ఐశ్వర్య మబ్బుతుంది. *అంతే. సంప్రదాయమైన కుటుంబీకులే సమృద్ధిగా* ఆస్తులు సంక్రమించాలంటే మనం తొక్కేది మార్గం—లేకపోతే దేనికి సంప్రదాయం మట్టికొట్టుకోనా?"

"అయితే సత్సంప్రదాయ మల్లా డబ్బుని ఆకర్షించటానికే అంటావు!"

"డబ్బున్నవాడు సంప్రదాయం కొనుక్కుంటాడని చూట్టంలేదే? అట్లాగే సత్సంప్రదాయమున్న సమంధం దొరకడం సామాన్యమూ అని నేను అందరిచెవుల్లోనూ ఇల్లుగట్టుకుని పోరడం లేనికనున్నావు?—"

"నీకు సాంప్రదాయ మక్కర్లేదన్నావుగా!"

"నా కక్కర్లేకపోవచ్చు—కాని నలుగుర్లోనూ సాంప్రదాయమంటే వుండాల్సిన విలవ పోషించుకుంటూ రావద్దూ? మన కుంటూ సంప్రదాయమే ఆరోను."

"కావుంది—సంప్రదాయానికి వుండాల్సిన విలవ వుండనే వుంది. నువ్వు పనిగట్టుకుని పోషించేదేమిటి? డబ్బులేని వాడెందుకూ కొరగాడని, డబ్బున్నవాడే గొప్పని డబ్బు విలవని శ్లాఘిస్తూ మెడలో డప్పువేసుకుని తిరిగాడా నారాయణబాబు?"

"డబ్బు విలవ బ్రతికున్న వాడికల్లా తెలుసు. చెప్పనక్కర్లేదు. తెలిసిందా? కాని సత్సంప్రదాయమంటే, వుండాల్సిన మోజూ, ఇయ్యాల్సిన విలవా ఎప్పటికప్పుడు నలుగురి చెవులలోనూ గింగురుమని మోగిస్తుంటే తప్ప నిలబడి చావదు."

"ఛీ—నా కీ సమంధం అక్కర్లేదు"

అని చిర్రున లేచాడు భాస్కరరావు.

"అక్కర్లేకపోతే మానవోయి నాయినా—అక్కర్లేదనగానే మా నాయనగా అని బ్రతిమాలాడతాననిగాని అనుకుంటున్నావేమో—నా కవసరం లేదు తెలిసిందా? పిల్ల రత్నంలా వుంటుంది. చదువుకున్నది — నిన్ను ప్రేమించినకన్య — నువ్వు కోరుకున్న అప్సరస. కాళ్లదగ్గరకొచ్చినసమంధం—కనకవర్షం కురుస్తుంటే గొడుగేసుకుపోతావా? ఫో—ఇందులో కలిసొచ్చేదమైనా వుంటే అది నాకుమాత్రం కాదన్న సంగతి మరోకసారి జ్ఞాపకం చేస్తున్నా. నాకు తెలుసులే—ఈ చదువుకున్నవాళ్లకి ఆశయాలనీ, ఆదర్శాలనీ మారనిపరుగెంతో బుర్రలో మసుల్తోవుంటుంది. చూపులు ఆకాశంమీదపెట్టుకున్నా నడవాలిసింది నేలమీదరా నాయనా! నేలమీద! ఇప్పుడు నిన్ను ఎలాగయినా బలవంతపెట్టి ఈ వివాహానికి దింపుతానేమోనన్న అపాయానికి ఉపాయమేమిటా అనే ఆలోచనలో పడనక్కర్లేదు. నువ్వు ఎదురుకోవాలిసినప్రమాదమేమిటంటే—నాకక్కర్లేదనిగాని నువ్వు అనాలోచితంగా నోరు జారితివా నిన్ను కారణాలైనా అడక్కుండా వొదిలేసుకుని చూచోడానికి సర్వసిద్ధంగా ఉన్నాను. తెలిసిందా?" అని ఉపదేశపూర్వకంగా హెచ్చరించి పక్క సర్దుకున్నాడు చంద్రంగారు.

నారాయణబాబు నాలుగైదురోజులనించీ చంద్రంగారింటికి ఎడతెరిపిలేకుండా వెళ్లివస్తూవుండడం గమనించింది కమల. ఆ వేళ ఆ చెవిగాడుపు ఈచెవికి గొడుతోవుంది. తిరిగితిరిగి యింటికొచ్చాడు నారాయణబాబు. రాగానే హాల్లో పడకకుర్చీలో కూలబడి వుత్తరీయంతో విసురుకుంటున్నాడు. ఏదో అయోమయంగా కూచున్నట్టనిపించింది కమలకి. అతని మనస్సులోపడ్డ అగాధమేదో మొహమ్మీద కనిపిస్తోంది. గబగబ నాలుగు నీరుబాదంపలుకులు మిళాయించి కొంచెం నిమ్మకాయషరబత్తుచేసి అందించింది. వట్టివేళ్ళ విసనకర్రమీద కూజాలోని చల్లనినీళ్లు కసింత చిలికి పక్కన నిలబడింది. "పంకావేయి అమ్మా" అన్నాడు నారాయణబాబు. "పంకాగాలి వేడిగా వొస్తోంది నాన్నగారూ" అని వారించింది కమల. కొంచంసేపు బడలికతీరింతరవాత "ముహూర్తం ఇంకా కుదరలేదా నాన్నా" అని అడిగింది కమల. తన వివాహవిషయంలో తనే కలిపించుకుని అడగట మదే మొదటిసారామెకు.

"దానికే తడిమున్నా పొడిమున్నా అయేలా తిరుగుతున్నానమ్మా—చంద్రంగారు భాస్కర్రావుని అడగమంటూ నేమిటి?"

"ఆయనవా? ముహూర్త విషయంలోనా?"

"కాదు—అసలు పెళ్లివిషయమేనట."

"అదేమిటి?" ఆమె కర్థంకాలేదు.

భాస్కరరావు కింకా అభ్యంతరాలున్నాయా!

వెండిప్లేటులో పూరీలూ బజ్జీలూ పట్టుకొచ్చి దగ్గరపెట్టింది నాయనమ్మ. పూరి బాగా వేగినవైపు ఒక్క పిసరుతుంచి మునిపంటకొరికి "సయించడం లేదమ్మా—తీసెయ్యి—" అన్నాడు నారాయణబాబు. "అదేమిటి నాయనా—పెదపాడు నుంచీ కర్పూరంలాంటి నెయ్యివచ్చింది—కన్నతల్లి కావాలని సొంతంగా చేసింది. ఇవాళ పోరాటాలు—ఒక్కటి నోట్లో వేసుకో నాయన గాదూ" అని బొమ్మ పరచనే వున్న ముక్కాలిపీటమీద కూచుని లాలనచేస్తోంది. ఎంత వయస్సొచ్చినా నారాయణబాబు పసిపాపడే ఆమెకు. "మందంగా వున్నదమ్మా" అని మొహం చిట్లించాడు నారాయణబాబు.

కమల మంచినీళ్ళకని మరచెంబు పుచ్చుకుని

రీడింగు రూమనుకుని, పడకగదిలోకి పరధ్యానంగా వెళ్ళి, టేబిలుమీద వున్న రంగూను పాలరాతి బుద్ధవిగ్రహం చేతికి తగిలి, ఇక్కడికెందుకొచ్చానా అని నిలబడిపోయింది—ఆమెకు మనస్సు మనస్సులో లేదు.

అనుకున్నట్టే నారాయణబాబు భాస్కర్రావుతో మాట్లాడడానికని వొచ్చాడు. తండ్రీ యిసంతా తనమీద గుర్రెయ్యాలని చూస్తున్నట్టు గ్రహించాడతను. భాస్కరం వోకెయెత్తు వెయ్యాలని చూశాడు. తను ఏదో కొంత మొరటుతనంగా మాట్లాడేస్తే అతనికి మండి చిర్రుమంటాడు దానితో తనూ తారస్థాయిలో అందుకునేది. ఒక పెద్ద గలాటాకింద దింపేసేది. అంతేగాని అతనితో తాపీగా వాదానికి దిగితే తనకి వొక్కపాయింటూ మిగిలిచావదు. అదీ అతని భయం.

"అయితే భాస్కరరావూ—మీ నాన్నగారు దీ కింకా ఏవో అభ్యంతరాలూ గట్రా..."

"క్షమించండి. నాకు వుండుకున్న అభ్యంతరాలన్నీ మీతోటి చర్చించదలచుకోలేదు నేను. సమంధం నా కక్కర్లేదని మాత్రమే మీతోటి చెప్పుమన్నాను."

"అది ఫలకైనమాటే—కాదనను—ఎంచేతనంటే నా కక్కర్లేదని నువ్వంత నిష్కర్షగా చెబుతోన్నప్పుడు నీ కారణాలకోసం ఎదురుచూడాల్సిన అవసరం, నాకూ లేనేలేదు. అది మొదట్లో

అయితేనూ—కాని, ఇప్పుడు, ఇంతదూరం వచ్చిం తరవాత, ఇన్ని తంతులు జరిగిం తరవాత..."

"మించిపోయిం దేమున్నది లెండి."

"నీకు తెలియదు భాస్కరరావు—తాంబూలాలు పుచ్చుకున్న తరవాత, ప్రధానమయిం తరవాత—శుభలేఖ లచ్చువుతూ వుంటే సమంధం చెడిందంటే నీకు మించిపోయిందేమీ లేకపోవచ్చును—గాని ఆడపిల్లని కన్న తండ్రిని, నాకు కలిగే నష్టాన్ని నువ్వు భర్తీ చెయ్యలేవు. తెలిసిందా? ఈ సీజన్లో ఎంతో ప్రబలమైన కారణాలు వుంటేనే తప్ప సమంధాలు చెడవు. చెడితే మరి సమంధా లెక్కవు. ప్రధానమయిం తరవాత మరో పెళ్లిమాటలకి దిగడం మారుమనువుకింద పరిగణిస్తారు మనవాళ్లు. నలుగురూ నాలుగు విధాల చెప్పుకుంటారు—పిల్లకు ముక్కు వంకరో మూతి వంకరో—నడవడి మంచిదవునో కాదో అని శంకించేదాకా వెడతారు. ఇంతదూరం ఎందుకు చెబుతున్నానంటే మీ రిద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకుంటున్నారని కూడా పుకారు పుట్టింది—నీకు తెలుసునో లేదో."

"అయితే సంజాయిషీ ఇమ్మనమంటారా?"

"నే నంతమాట అనను. కాని నీ సందేహం ఒక అపోహ మాత్రమే కావచ్చు. అది ఎంతవరకూ సహేతుకమో పరిశీలించుకోవడానికీ, సాధ్యమైతే నీకు నచ్చచెప్పడానికీ నాకు అవకాశం యివ్వడం సబవు. నీ మెడలు విరిచి ఎట్లాగైనా నాపిల్లని నీకు కట్టబెట్టాలని చూసుకునేటంత కక్కుర్తి నాకు లేదు. నమ్ముతావా?"

ఎంతకీ వదలడు! సరిగదా మెల్లగా వ్యవహారంలోకి దింపుతున్నాడు. తా నింత గడుసుగా మాట్లాడుతూన్నా కోపం రాకుండా పోయిందేమిటోయనికి! తనఎత్తు సాగేలాలేదే—ఇప్పుడెట్లా? సాధనాంతరం ఆలోచించ నేలేదని. తొణుకూ బెణుకూ లేకుండా ప్రశాంతంగా చెప్పుకొంటూపోతున్నాడంతే. ప్రపంచపు పోటుదుడుకుల్లో నలుగుడుపడి వొళ్లంతా కాయలుగాచి చేవదేరినవాడిలా అవుపిస్తాడు. పథకం మార్చాడు.

"పోనీ క్షమించండి—మీ సంప్రదాయానికి సంబంధించిన కొన్ని వాంశాలు నాకు అప్పట్లో తెలియక మాట యిచ్చాను."

"సుళువుగా క్షమాపణకోరేసి గతాన్ని తుడిచిపెట్టేయాలని చూడకు. కాని అట్లాంటి ముఖ్యమైనవాంశాలు ముందే తెలుసుకుని వుండాలిసింది నువ్వు—అవునా?"

"అవ్వే—చెబుతున్నాకదండీ—తెలుసుకోవలసిందే! కాని తెలుసుకోలేదు—నాకెవరూ తెలపలేదు. క్షమించండి—సరేనా?"

"సరేసరే—అయితేఏమిటి? నాసాంప్రదాయాన్ని గురించా?"

"అవును"

"అంటే నేను చిన్నప్పుడు వంటమనిషిగా బ్రతికాననే కదూ? స్పష్టంగా చెప్పు—అందులో తప్పులేదు—ముసుగులో గుద్దులాటెందుకూ? వంటపనంటే అంత నీచమా?"

"ఏదో అంతా అట్లా అనుకుంటారుకదండీ"

"అంతా అట్లా అనుకుంటే నువ్వూ అనుకోవాలా? అంతా రజస్వలా వివాహాలు తప్పనుకుంటారు? నువ్వు తప్పులేదని వాదిస్తావెందుకని?—అంతా ఆడపిల్లలకి చదువు కూడదంటారు—నువ్వుచదివించాలని పట్టుబడతావు దేనికి? చదువుకున్న ఫలిత మిదా! అంతా అనుకొంటూవుంటే నువ్వూ కాబోలనుకుంటున్నావా? స్వతంత్రంగా ఆలోచించి చూసుకోవాలిసిన విధి ఆలోచించుకో గల శక్తి నీకు వున్నదా లేదా?"

"అంతా అనుకోవడమే కాదులెండి—నాకూ అట్లాగే అనిపించింది చెప్పొద్దూ—ఏమీ అనుకోకుండా వుంటే ఇంకా స్పష్టంగా చెబుతా మరి, ఏమిటి చేసేది. వంటమనిషి అంటే ఎట్లాగూ ఒకడికింద నౌఖరీ కదండీ"

"అయితే మీ నాన్నగారు చిన్నప్పుడు షావుకారు గుమాస్తా చేశాడు. గుమాస్తాగిరీ నౌఖరీకాక యాజమాన్య మవుతుందా?"

"గుమాస్తాగిరీ అంటే అది వేరు. వంటపని అంటే కూలిపని గాదండీ! మీ కోపమొస్తే చెప్పలేనుగాని..."

"కూలిపని అంటే రెక్కలోడ్చుకునే పని అనేగాని అర్థం—గుమాస్తా గిరిలో మాత్రం రెక్కల కష్టంలేకుండా వున్నదా? కావలసిన వస్తువు కూరడం—అందివ్వడం—లెఖ్ఖ వ్రాయడం—సరిపుచ్చడం—సరుకు నిల్వలు చూచుకోవడం అంతా వొళ్లు శ్రమలేనిపనా—చెమట పోయకుండా వొళ్ళు మకిలికాకుండా పంచె నలక్కుండా జరుగుతుందా గుమాస్తాకి? వంటపనిలో మాత్రం తెలివితేటలక్కర్లేదా! ఎట్లా తంపలేసినా సువాసనగల పోపులూ, కమ్మని వంటకాలూ తయారైపోతయ్యా? గుండిగ వార్చక్కస్తే చాలు నైపుణ్యం దానంతటదే చవులూరి బల్లారుతుందా?

"శ్రమపడాలి—తెలివితేటలూ వుండాలనుకోండి"

"అందులోనూ ఇందులోనూ కూడా"

పైగా వంటమనిషంటే చాలా చులకనకదండీ—యజమానులు అడ్డమైన మాటలూ అంటారు—హీనంగా చూస్తారు.

"అడ్డమైన మాటలూనా? పన్నవటానికి దమ్ములేవడికీ లేవా నాకు మరి—కనుక్కో—శారదమునివారింట్లో మీ నాన్నగారు గుమాస్తాగా వున్నప్పుడే నేనూ వంటకి కుదిరాను. మీ నాన్నగారి నడుసుపాసీ వా రంబద్ధమూడిరు. రాత్రి తొమ్మిదిన్నరకి స్లాపంచె కట్టుకుని, అమ్లా హాయిరాయిలు రాసుకుని క్రాపు నున్నగా దువ్వి వెళ్లిసందున విల్సు పొగవొదుల్తూ సినిమా రెండో ఆటకి దలాయిస్తుంటే అపరాత్రివేళ అప్పుడే వొచ్చిన ముట్టహాయకి బియ్యంపోసి వెళ్లమని ఇంటావిడ ప్రాధేయపట్టమూ నేను వినిపించుకోకుండా రుసలు పెస్తుండడమూ, పొగమూరే హరికేనులాంతరు దగ్గర జనతాలెఖ్ఖ కుదరక పందవాళీలో ముక్కుతో మూలుగుతో కూమున్న మీ నాన్న వోరకంట కనిపెడుతూ నవ్వుకునేవాడు. అసలు నేనంటే ఇంటావిడ లగాయతూ, పిల్లా జల్లా సమేతా అందరికీ వొకటే హాసలు—దీనికి కారణం నేను పని కరెక్టుగా చేసేవాడి ననుకుంటున్నావేమో. నెలకు కనీసం పది నాగాలైనా పెట్టేవాడిని. నాగాలైన మర్నాడు హాజరైతే ఏమని అడిగేందు

వాళ్ళకి ఖలేజా వుండేదికాదు. అందాకా ఎందుకూ, మీ నాన్న గుమాస్తా అన్నమాటేగాని రోజా కొట్టు తెరిచేముందు కూరా గారా కొని ఇంట్లో పడేసి వెళ్లడం పిల్లలకేమన్నా కొంచెం నలతగా వుంటే ఆసుపత్రికి వెళ్లి అరఖులాగలా పట్టుకురావటం వగయిరా డ్యూటీలు వుండేవికే. తెచ్చిన కూరల్లో ముదురు వంకాయనీ, పండు కాకరనీ, చేదు దోసకాయనీ, పుల్లి మిరపకాయనీ తీసిపారేస్తుంటే ఇంటామెకి మీ నాన్నమీద గుర్రుగా వుండేది. నేను ఏరిపారేస్తున్నానని గాదు. మీ నాన్న చేసిన నిర్వాహకానికి. ఆ విలువకి కారణం లేకపోలేదు—గుమాస్తాని తొలిగిస్తే ఆ స్థానే బజారులో తొక్కితే లేస్తారు పదిమంది. వంటమనిషిని తొలిగిస్తే ఇల్లాలికి తక్షణం గరిటె చేతికొస్తుంది. మళ్ళీ వొక మనిషికోసం గాలించి పట్టుకు వేసరికి ఏడాది గిర్రున తిరిగి వస్తుంది."

పోరి నీఇల్లు మాసిపోను!–వూపిరి సలపనిచ్చేటట్టు లేదీయన!–మొత్తానికి రణరంగంలోకి ఈడ్చుకొచ్చాడు తనని—తను మొదట్లో అనుకున్న దేమిటి? ఇంతదూర మెట్లా వచ్చాడూ తను! ఖావుల్లేదు. చూడగా చూడగా ఈయనా తన తండ్రీ ఒక స్కూల్లో చదువుకున్నారేమిటీ అనిపిస్తుంటే! ప్లేటు మార్చాడు.

"కేవలం మీరు వంటపని చేశారని కాదనుకోండి—ఆ తరవాత మీ రవలంబించిన వృత్తి అదీ......"

"అంటే హోటలు పెట్టావనా?"

"అదేలెండి అన్నం అమ్మకునే వృత్తి."

"అన్నీ అమ్మకోవచ్చు గాని అన్న మమ్మకోగూడదా?"

"అన్నం పరబ్రహ్మస్వరూపం..."

"అన్నం పరబ్రహ్మమంటే ఫక్కున నవ్వే నువ్వు అన్నం పరబ్రహ్మమంటే నమ్ముతావా? విద్య అమ్మకోవచ్చా?"

"అదీ అమ్మకోగూడదు నిజానికి—మన ప్రాచీన మహర్షులు గురుకులాల్లో......"

"అయితే స్కూలు మేష్టర్లంతా సంప్రదాయం చెడ్డ వాళ్లేనా?"

"ఆ—చెడినవాళ్ళనే నా వూహ."

అయితే కాలేజీలో చేరిం తరువాత కూడా హైస్కూలు మేష్టర్లెవరయినా అవుపిస్తుంటే అతివినయంగా ఇంకా దణ్ణాలు పెడతావు దేనికని?—ఆ విద్యావిక్రేతలకి—అంతటి గౌరవానికి అర్హతలేనివాళ్లకి — ఇంతయెందుకూ! మానప్రాణాలలో ఏది వున్నతం?

"మానం"

"ప్రాణం నిలుపుకునేందుకు తినేది అన్నం — మానం కాపాడుకునేందుకు కట్టేది బట్ట—అవునా?

"అవును"

"అయితే మరి నీ లెక్కప్రకారం అన్నమమ్మకోవడం నీచమయితే గుడ్డ అమ్మకోవడం నీచాతినీచమవుతుందా కాదా? మీ బహదూర్ మామయ్యకిచ్చే పాలుసరి రాబడిలో మూడువంతులు బట్టలషాపుమీదనని తెలుసునా నీకు? తెలిస్తే ఎవరివల్ల నీకేదో సాంప్రదాయం సంక్రమించిందని అనుకుంటున్నావో ఆ ఆసామీ తాలూకూ సాంప్రదాయం జాలుగింట మూడుపాళ్లు చెడిపేట్టే ఎందుకుంటావా?"

"మీవాదన విపరీతంగా వుంది. గుడ్డ అమ్మకోవడానికీ పచ్చళ్లు అమ్మకోవడానికీ సాపత్య మేమిటండీ?"

"నేను పచ్చళ్లని పేరుపెట్టి అమ్మకం పెట్టలేదే! ఆవకాయికి కొన్ని కొన్ని మార్పులతో "అరుణోదయలేహ్యమని" పేరుపెట్టాను. గోంగూరపచ్చడికి పుడేనాగట్టా తగిలించి రుచిలో ఒక విలక్షణత కలిపించి "బ్రెడ్ స్ప్రెడర్" అని పేరుపెట్టి బాటిల్సులో..."

"'బ్రెడ్ స్ప్రెడర్' ఏమిటి?"

దొరలు రొట్టెలమీద "ఛీజ్"లాగ, "జామ్" వాడినట్టు వుపయోగించేవాళ్లు దీన్ని—అదట్నే అంటే దొరలంతా వూటలూరుతో తినేవాళ్లు తెలుసునా? 'మాంబళంనించీ, 'యూరపియన్‌కాలనీ నించీ', వాల్తేరు 'అప్‌లాండ్సునించీ', 'బెంగుళూరు కంటోన్మెంటు'నించీ, కుప్పతిప్పలుగా వొచ్చిపడే ఆర్డర్లకి తట్టుకోలేక పొయ్యేవాళ్లం"

"ఎన్ని పేర్లుపెట్టినా ఆవకాయ ఆవకాయేకదండీ? మా పెత్తండ్రిగా రనేవారులెండి..."

"మీ పెత్తండ్రిగా రెక్కడున్నారిప్పుడు?"

అమ్మయ్య సంభాషణ మార్చినట్టున్నాడు. — —

"బెజవాడలో మెడికల్‌స్టోర్సు పెట్టారులెండి"

"మెడికల్‌స్టోర్సా" అయితే ఆ స్టోర్సులో టానిక్కులూ ఇంజక్షన్లూ గట్రా అమ్ముతారా?"

"అట్లా అడుగుతారేమిటి? పల్లెటూరి కేవయ్యలా!...మళ్ళీ ఏ చెంపనించో దెబ్బ తీస్తున్నాడా?

"ఎందు కమ్మరూ?"

"ఓవల్టిన్ జెవితో: చేస్తారో?"

"కోడిగుడ్ల సొనతోటి."

"కాడ్ లివరాయిలూ?"

"చేపనూనెతో—అది పేరులోనే వుంది."

రక్తహీనంగా వున్నప్పుడు, కొన్ని ఇంజక్షన్లిస్తారు దూరావృనియో హెపటిక్సనీ, హెపటిక్సనీ...అవి దేనితో తయారి అంటావు?"

"ఏమో నాకు తెలియదు."

లేకపోతే ఏమిటి ప్రాసింగు?

"తెలియకపోతే చెప్తా విను—అవ లేమిటంటే మేకల కారిజంతీసి, దాని 'ఎసన్సు' 'యాంప్యూల్సు'గా సీలుచేసి అమ్ముతారు."

"అయితే కావచ్చును."

"ఓవల్టీను టిన్నులూ, హెపకెన్ యాంపూల్సూ ఆ మెడికల్ స్టోర్సులో సేలవుతాయిగదా—మీ బాబాయి కోడిగుడ్లూ మేక మాంసమూ అమ్ముతున్నాడంటే ఒప్పుకుంటావా?"

"సరిపోయింది. ఓవల్టిన్ కోడిగుడ్డు పొడటండీ? ఆ పొడతో ఇంకా ఏమేమి మిళాయిస్తారో, నిలవవుంటానికి, ఏయే సాధనాలు అవలంబిస్తారో మీకూ తెలియదు—నాకూ తెలియదు—కోడిగుడ్డులోంచీ ఓవల్టిన్ డబ్బా ఊడిపడుతుందిటండీ." దానికీ దీనికీ మధ్య ఎన్ని బుర్రలు, ఎన్ని చేతులు ఎన్ని యంత్రాలు పనిచెయ్యాలో గమనించారా మీరు?"

అట్లాగే ఆవకాయలోనించీ 'అరుణోదయ లేహ్యమూ' పుడిపళ్ళే. ఇంకా అపురూపమైన యితర సామాగ్రీ, పాళ్లు కలపడం లగాయతు బ్రహ్మరుద్రుడికయినా తెలియని రహస్యాలూ ఎన్నివున్నాయి. ఆ ఇన్డస్ట్రీలో...ఎలక్ట్రిక్ స్టౌలమీద పని జరిగేది. డబ్బుకోట్లో కలిపి రాచ్చిప్పల్లో పెట్టి అమ్మనవుకున్నావు గాయాలు—నేను ఎగుమతి చేస్తుంటూ ఊరగాయనీ, గోంగూర పచ్చడినీ ఎవరైనా వీసం గ్రహిస్తే చాలునుగోజాలు వ్యాపారం సాగించగలిగేవాడినా నేను? ఆ వ్యాపారంలో ఒక్క ఏడాదిలో లక్ష ఏభైవేలు సంపాయించాను. రెండువందలమందికి పని గలిగించాను. తెలివితేటలందులో పని చెయ్యలేదని అనటానికి ఎవడికైనా ఎన్ని వేల గుండెలుండాలో ఆలోచించి అంచనావేసి చెప్పమూడాం."

భాస్కరం వుక్కిరిబిక్కిరయిపోయాడు.

"అయితే మీ వాదన సహేతుకంగానే కనిపిస్తోంది నాకు. ఎంచేతనంటే ఇప్పుడు నాకర్థమవుతోంది క్రమక్రమంగా. మీరు దానిలో కొంత కృషిచేసి ఒక 'మాన్యుఫేక్చరింగ్ కన్సరన్' క్రింద ఇండస్ట్రీ స్టార్టుచేసి లార్జిస్కేలుమీద ఎగుమతిచేస్తూ వ్యాపారం సాగించారన్నమాట."

"అట్లా దారికి రా. అయితే యింతకీ ఆవకాయి ఆవకాయి అని సూటిగా చెప్పి దగాలేకుండా అమ్ముకుని డబ్బు చేసుకుంటే సంప్రదాయహీనమన్నమాట! ఆవకాయని మార్చి అరుణోదయ లేహ్యమని చెలామణీలో పెట్టి, బాటిల్స్‌లో బిగించి కార్కులతో సీల్ చేసి లేబిల్సు అంటించి మసిపూసిన మారేడుకాయిగా తయారుచేసి పల్లెవాడి లగాయతూ తెల్లవాడివరకూ దొరక్కుండా అందరి కళ్ళల్లోనూ పరిసమానంగా నిష్పక్షపాతంగానూ కారం గొట్టి ధనం రెండు చేతులా తోడిపారేస్తే సంప్రదాయం దెబ్బతినకుండా అట్లా నిలబడి వుంటుందన్నమాట."

"అపరేషను చేస్తున్నారండీ." తల గోక్కున్నాడు భాస్కరం.

"అది కాదు. సంప్రదాయమని నువ్వు కల్పించుకున్న ఆదర్శపు నీడల్లో ఎన్ని వైపరీత్యాలు దాగుడుమూతలున్నయో నీకంటికి కనిపించాలనీ, నువ్వు యిన్నాళ్ళూ పోషించుకొంటూవస్తూవున్న విలువల్ని నీకు చీల్చి చూపాలనీ నా ఆశయం, అంతేగాని, నిన్ను ఒప్పించాలనీ, వితర్కాలతో నిన్ను నా వేపుకు తిప్పుకోవాలనీ నేను కాంక్షించటం లేదు. నాకూ వివరాలన్నీ తెలుస్తూనే వున్నాయి. లోకంలో ఎన్ని రకాలయిన స్వార్థాలున్నయో అన్నిట్లోనించీ ఈదుకునే వచ్చాను నేను—ఇప్పుడు ఎవళ్లో నిన్ను ఎక్కేనాచేసి ఈదురాలోదవలన్నీ చెప్పి నిన్ను నాదగ్గరికి పంపించారో వాళ్ళంతా ఎప్పుడో ఒకప్పుడు ఎవడిచేతనో ఒకడిచేత తమ తమ సమంధాలనుగూర్చి నాకు రహస్యంగా చెప్పించుకుని చాటునా మాటునా నన్ను పొగించి దూయకున్నవాళ్ళే—వాళ్లెవళ్లకీ పట్టని అదృష్టానికి మరోవాడు పట్టభద్రుడవుతుంటే మానస్తా ఊరుకుంటారా? వాళ్ల అక్కసూ అసూయా అన్నీ పేరుకుని మారువేషాలలో వెటకారం రూపేణా వెళ్ళగక్కకుండా వుంటారూ? అది నీమీద గాబట్టి బాగా పనిచేసివుంటుంది."

"నారాయణబాబుగారూ క్షమించండి. పోనీ మీ ఇష్టమెట్లాగో అట్లాగే కానీండి." బరువు దించేసుకున్నాడు భాస్కరం.

"నా కట్లా పనికిరాదు. నీకు నిజంగా నా సంప్రదాయమంటే తేలిక అభిప్రాయం లేదని నాకు రూఢిఅయితేనే నీతో వియ్యమందుతాను నేను. అంతేగాని నేనేదో చాలాదూరం చెప్పాను గదా అని సర్దుకోబోతే ఎట్లాగూ అన్నట్టు కొండ దిగివొచ్చి నాకేదో ఒరగబెడుతున్నట్టు నటిస్తే మాత్రం నా అభిమానం గాయపడుతుంది. నువ్వు లోతుగానే ఆలోచించి మరీ చెప్పు. ఎటాగూ కొంత మథనపడితేనేగాని, మనిషి ఏ నిశ్చలమైన నిశ్చయానికి చేరుకోడు. అదీ ఒకందుకు మంచిదే—నేను వెడతా."

నారాయణబాబు వెళ్ళిపోయాడు.

ఇదంతా చంద్రంగారికి తెలిసింది. తెలుసుకోకుండా వుంటాడూ? ఆయన భాస్కరంతో ఘర్షణపడ్డాడేగాని తెలివి తక్కువగా వొదిలేసి కూర్చోలే—ఆయనకి బాగా తెలుసు నారాయణబాబు సత్తా—కాని ఒక అనుమానం ఆయన్ని పీకుతోంది. నారాయణబాబు మళ్లీ పెళ్లిచేసుకుంటాడా? ఏమో—.

భాస్కరాన్ని కదిపిచూచాడు. సుభద్రమ్మని పురమాయిస్తే ఆ కీలకం తెలుస్తుందని సలహాయిచ్చాడు భాస్కరం. సుభద్రమ్మ ఇక్కడికీ అక్కడికీ కనపడని టెలిగ్రాఫ్ తీగెలా పనిచేస్తూ వున్నదని ఇద్దరికీ తెలియదు.

రెండు రోజులయింది మూడు రోజులయింది. నారాయణబాబు రాలేదు. భాస్కరానికొక వుపాయం తట్టింది. కాలేజీలో తన మిత్రబృందానికీ కమల స్నేహితురాండ్రకీ ఎవరెవరికి ఆహ్వానాలు పంపాలో ఆమెతో తను కూడబలుక్కోవాలిసిన అవసరమేదో వున్నట్టు హటాత్తుగా స్ఫురించిందతనికి. సరేనని బయలుదేరి చక్కా వెళ్లాడు. కమల స్టడీరూములో రాకింగ్ ఛెయిర్లో కూచుని పేటీసుడ్డమీద డి. యం. సి. దారంలో పూలగుత్తి డిజైను వేస్తోంది. భాస్కరం చూచాడు. ఆట్టే అలంకారాలు లేనేలేవు. అంచేతనే మరీ అందంగా వున్నదా! ఆమె ముందుకి రాగానే తానేదో మారిపోయినట్టే ఉన్నాడు భాస్కరం. ఆమె సౌందర్యం అట్లాంటిది. అంతర్గతంగా పరిమళమై పొంగుతుంది గాని ఆకృతిగా కనురెప్పలు పట్టుకుని వేళ్లాడదు. నిజంగా ఇట్లాంటి అందాలరాణే ముందు సంప్రదాయమనీ దట్టుబందాలకి

ఏమిటి తనకీ కల్యాణ పరీక్ష? నారాయణబాబు తనతో అంత వాగ్వివాదం పెట్టుకున్నాడుగాని కమలతో వొక్కసారి మాట్లాడమంటే వొదిలిపోయేది.

భాస్కరాన్ని చూడగానే కమల ప్రొద్దుతిరుగుడు పువ్వులా గిరుక్కున తిరిగి "రండి కూచోండి." అని సవినయంగా స్వాగతమిచ్చి పావురాయిలా తుర్రుమంది ఇంట్లోకి.

అదేమిటి? అంతా సిగ్గ?

క్షణంలో కాఫీ పట్టుకొచ్చింది కమల—అందుకనా?

"వుంటారుగా పూరీ లింకా వేగలేదు—వస్తా" అని వెళ్లిపోతోంది. కాఫీ కొంచెం సేవించి "చాలా బావుంది—నీలగిరి కాఫీగింజలా? నువ్వేనా చేస్తా? అని వోరకంట ప్రశ్నార్థకంగా చూశాడు భాస్కరం.

"ఏదో లెండి—వంటపనిలో ఆమాత్రం నైపుణ్య మబ్బక మెుకలెఖ్ఖా—ఎంత లేదన్నా వంటమనిషికన్నా నైనాయెను."

సరిపోయింది. చురుకుమాటలలో చురకత్తులేవో నూరుతున్నట్టుం దీవిడగారు. అక్కడికే మాటతప్పించి "నీ చెణుకులకేమిగాని కాలేజీలో మనం ఆహ్వానాలు పంపాల్సిన ఫ్రెండ్సు లిస్టొకటి వ్రాసియ్య" అని పెన్ తీశాడు భాస్కరం."

"చెబుతా వ్రాసుకోండి — గుమాస్తావంశీకులికి వ్రాత పాంకంగా అమురుతుంది." కిసుక్కుననవ్వి వాలిక కొరుక్కుంది కమల.

అతనికి ధర్రుమంది. అంతా తనని లొంగదియ్యాలని చూస్తారేమిటి? ఎక్కడైనా వోటమి భరించవచ్చునుగాని—ఇక్కడ!—తను ప్రేమించిన తరళాక్షిముందు!!—తనకి కాబోయే ధర్మపత్ని యెదుట.!!!—అతనికి కోపమాగలేదు.

"నా సంప్రదాయం నువ్వేమీ ఎంచనక్కర్లేదులే — మాది వంటపనిగాదు. వంటపూటింటి పనిగాదు."

తిప్పికొట్టాననుకొన్నాడు. ఇహ లిస్టువ్రాయడాని కుపక్రమించాడు.

"తమవృత్తి ఏమిటో సెలవిస్తారా?"

"మాది వడ్డీవ్యాపారం."

ఆమెకు తెలియదుగావాల్ను!

"తాకట్టువ్యాపారమంటే నిజాని కింకా దగ్గరగా వుంటుందేమో."

"తణఖాలూ తాకట్లూ ప్రోనోట్లూ అన్నీ వడ్డీవ్యాపారం కిందకే వస్తాయి."

"అందులోనూ తాకట్లు మీ నాన్నగారు 'స్పెషలైజ్' చేశారులెండి."

"ఏమో నాకు తెలియదు."

తెలియదుగాబట్టే నే చెబుతున్నా — వడ్డీవ్యాపారమంటే బ్యాంకింగుకాదు మీ నాన్నగారుచేసేది. తూరుపుపేటలో షెగిడీలకీ, కొత్తపేటలో మిల్లుకూలిలకీ సిరంగిదిబ్బమీద వుప్పర్లకీ పాచిపని చేసుకునే పాటకజనానికీ రోజువారీ వడ్డీ కట్టుకొన్న పదులూ, యిరవైలూ, వుత్తరమూ, పత్తరమూ లేకుండా బదుళ్ళిచ్చి, (మళ్ళీ పత్రాలు వ్రాస్తే వాయిదానాటికి నోటీసులివ్వా, వస్తువు వేలానికి పెట్టా, ఎన్ని బాధలు) వాయిదానాటికి ఎలాగో అందకుండా తప్పించుకుని మన్నాడు వస్తువు తెగనమ్ముకుని డబ్బు జోసుకునే వృత్తి—ఇదీ మీ నాయనగారి వడ్డీవ్యాపారం తెలిసిందా?"

"ఇట్లాంటి వ్యాపారం మాకు లేదు. తణఖా దస్తావేజుల మీదా బ్యాంకుల్లోనూ..."

"మీకు తెలియదని ఇప్పుడేగా అన్నారు? ఆ తరవాత మళ్ళీ నే నన్నదల్లా కాదంటా రేమిటి?"

తనకి తెలియదన్నాడా? ఏమో జ్ఞాపకం లేదు—దిక్కుమాలిన గోల—

"నువ్వొచ్చీ నన్ను దెప్పనక్కర్లేదు—ఎంతమంది రెక్కల కష్టం మీదొప్పుకోకపోతే, హోటళ్లలో కౌంటర్లదగ్గర కూచుని, సర్వర్లకి తక్కువ జీతాలిచ్చి ఎక్కువపని చేయించుకుని ఎంతమంది పొట్టకొడితే, నీకీ లక్షలు పోగుపడ్డమో ఒకసారి సింహావలోకనం చేసి చూసుకో—మా నాన్న వృత్తిలో నెరుసు లేరవచ్చావు కాని.."

"దాఖలా కావాలా? మీ నాన్న 'షైలాక్' అని రుజువు చెయ్యనా?"

షైలాక్! నూకమ్మ వీళ్ల పనిమనిషి గావును—చటుక్కున జ్ఞప్తికి వచ్చింది భాస్కరానికి. తను మాత్రం ఏదో పొట్టి చేతులతో కుప్పిగంతులు వేస్తున్నాడు గాని, ఆమె ఏదో వొక ఆయుధం గుప్తంగా దాచుకునే వచ్చింది!..అంతలో ప్రసన్నమైన కంఠస్వరంలోకి దిగిందామె.

"అసలు మీ దగ్గరకి స్వయంగానే వద్దామనుకుంటున్నానన్నండీ—మా పనిమనిషి నూకమ్మ సంగతి చెప్పబోతున్నాను దానికి అర్థమూ శుద్ధమూ తెలియదు. తమ్ముడికి జబ్బుగావుండి తాకట్టుమీద మూజువాణీగా 15 రూపాయిలు తెచ్చిందట. వాళ్లది చూశావూ అదొక కాపుల లెఖ్ఖ—ఒకరోజులో పొరపాటు వచ్చింది గావును—దాని రాగిడీ దాని కిప్పించెయ్య భాస్కరం—మీ నాన్నగారితో చెప్తావుగదూ?" సోఫామీద ఫాటో ఆల్బం తిరగేస్తూ లాలన చేస్తోంది కమల.

ఇప్పుడుగాని సరే అన్నట్టయినా, తనదీ తన తండ్రిదీ అంతా తప్పని నిర్ధారణయిపోతుందేమో—గోల—

"మరి పేదజనులంటే, పాటకజనమంటే అంత మమకారమాయెను నీకు—నీదగ్గర పనిచేసే వొక పేదరాలు, నీమీద ఆధారపడి జీవించే ఒక అనాథ ప్రాణి—ఒకనాటి ఆపత్తుకి ఒక షైలాక్ దగ్గరికి వెళ్ళాలిసిన దుర్గతి పట్టిందన్నమాట పదిహేను రూపాయిల భాగ్యానికి. ఆమాత్రం అవసరానికి నువ్వాదుకోలేక పోయినావా?"

"నాకు తెలిస్తే ధస్తే వెళ్ళనిచ్చేదాన్నా మీ నాన్నగారిదగ్గరికి! అది ఇదివరకే మాదగ్గర వంద రూపాయిలదాకా వాడుకొని వుంది. అంచేత మళ్లీ అడిగితే ఏమనుకుంటారో అని అడగలేదు. ఈ కథన వినగానే నేను వేసిన మొదటి ప్రశ్న అది."

"అవునులే దానికింత పిండాకూడు పడేసేదీ, నెల కోసో నాలుగు రాళ్ళు తగలేసి పేదరికంలో వుంచేసేదీ, ఆతరవాత అనాపా తనాపా వంద రూపాయిలుదాకా పెట్టుబడి పెట్టేదీ—వూరికే నే ఇచ్చేస్తున్నట్టు హుందాగా చెప్పుకునేదీ—"

"వూరికే కాకపోయినా వడ్డీ లేకుండా నేలేండి—సరేగాని ఇప్పుడు దాని పేదరికానికీ, నా భాగ్యానికీ, మీ ఆర్జనకీ పునాదులు త్రవ్వుకుంటూపోతే సృష్ట్యాదికి పోవాలిసుంటుంది. నేను చెబుతుంటూ దానికి జరిగిన వొక అన్యాయాన్ని గురించి—మీ నాన్నగారితో చెబుతారా చెప్పరా?" సీరియస్‌గా అంటోం దామె.

"నేను చెప్పను. కావాలంటే దానినే మా నాన్నగారితో చెప్పుకోమను."

"అంతేగాని మీరు కలిపించుకోరన్న మాట."

"నాకా బాధ్యత లేదు."

"కాని లాకప్‌లో పెట్టిస్తానని ధిక్కారం చేసినప్పుడు మాత్రం మీ బాధ్యతలూ, హక్కులూ గుర్తుకొచ్చినట్టున్నాయి."

"అప్పుడు అది కొన్ని మాటలు మిగిలింది. అంచేత దాన్ని నోరు మూయించాల్సొచ్చింది."

"అంత తిరుగుబాటు చేసేముందు దానికి ఎంత కష్టం కలిగి వుంటుందో మీరు వూహించుకోకపోతే ఎట్లా?"

మౌనం.

"చెబుతారా?"

"చెప్పను."

"నీ కళ్లెదుట జరిగే వొక అన్యాయాన్ని అరికట్టలేని నువ్వు పేదవాళ్లనించీ పిండి వొక్కొక్క నెత్తురు బొట్టుతో బాటు ఒక్కొక్క రూపాయి రాల్చుకు తినే నువ్వు నా సంప్రదాయమూ నా నాగరికతా ఎత్తి వచ్చావా? సాంప్రదాయమున్నా లేకున్నా లక్షలు కొల్లగొట్టేందుకు తయారుగా వచ్చినట్టున్నావు."

పంజా విప్పిన ఆడపులిలా లేచింది కమల.

"నీ లక్షలెవరికీ అక్కర్లేదు. హద్దుమీరి మాత్రం మాట్లాడకు."

సోఫాలోనించి తారాజువ్వలా లేచాడు భాస్కరం.

"లక్షలు అక్కర్లేకపోయినా వొస్తుంటే తప్పేముందా పాపం-ఎన్ని లక్షలున్నదో యోగ్యం లెక్క పెట్టుకునే వొచ్చినట్టున్నావులే. మానాన్న రెండో పెళ్లి చేసుకోడని రూఢిచేసుకున్నారుగా అవునా? మా సుభద్రమ్మత్తయ్య చెప్పేవుంటుందిలే. కమకొక్కష్టని సివదీగా పంపించారుగా సిగ్గులేకుండా—ఇహను ఆస్తి యావత్తూ సంక్రమించేందుకు ఆటంకాలు లేవని నిర్ధారణ అయిపోయిందిగా—తనుదువమ్మా అని అంగీకారం చెబుదామని వచ్చినట్టున్నావు. చదువనూ, నాచదువూ, నీ సంప్రదాయమూ, నీనాగరికతా ఇవన్నీ పడివేసిచ్చి మార్కెట్లో రేపే పాతికెక్కల్లా కొనగలను నేను."

నారాయణబాబు అకస్మికంగా లోపలికొచ్చాడు.

"అమ్మాయీ ఏమిటిది! భాస్కరం—ఊహో—తొందర పడకు" అని సముదాయిస్తున్నాడు.

కమలకి రౌద్రం మాగలేదు.

"నన్ను అటకాయించవద్దు నాన్నా—నాకీ పెళ్లి అక్కర్లేదు"

భాస్కరరావు వెళ్లిపోయాడు. అతని మెదడు పొత్తిగా చెడిపోయింది. ఇంటికి వెళ్లివెళ్లగానే తల్పడిమీద విరుచుకుని పడ్డాడు, వ్యవహార మెట్లా చెరగిలపడిందో కొంత మాదిరిగా చెప్పి—

"అసలూ ఈ అలగా జనానికి పదులూ పదిహేనులూ ఇచ్చి విపరీతంగా వడ్డీ వేసికట్టి కాకట్టుసొమ్ము లమ్ముకుంటేనేగాని గడవదా యేమిటి నాన్నా మనకి?"

"విపరీతమైనవడ్డీలు ఇచ్చేవాళ్లు! లేనిదుగ్గ పుచ్చుకునేవాళ్లు! వడిలే యెట్లా? ఇంతకీ వడ్డీలు తగ్గించమనేగా నువ్వనేదీ?"

"అవును—ఏదో న్యాయమైన వడ్డీలు కట్టుకుని..."

"న్యాయమైన వడ్డీలనకు—తగ్గింపు వడ్డీలను—అసలు తగ్గింపు వడ్డీలమీద యిచ్చుకుంటే మనకీ అలగాజనంతో పనేమిటి?" ఏ తిణఖాలమీదనో, ఏఘరమ్ములోనో గట్టిపద్దులుచూచుకుని లక్షణంగా కాలక్షేపంచేయడం మంచిది."

"అవును అట్లా ఎందుకు చెయ్యకూడదూ? ఇది నీదం కాదూ?"

"అట్లాచేస్తే మనకొస్తున్న రాబడిలో పదోవంతయినా రాదు."

"రాకపోతే మానె వచ్చినంతఅయెను."

"రాకపోతే పోనిమ్మని లక్షలున్నవాడు అనాలిసినమాట. ఇంతకీ నేనేదో ఈ అలగాజనాన్ని పీల్చేస్తున్నాననీ వేధించుకు తింటున్నాననేగా."

"అందుకు సందేహంకూడానా?"

"నేను మొదట్లో ఈ వ్యాపారం ప్రారంభించినపుడు ఈ పేటలో వాళ్లంతా పండుగ చేసుకున్నారు."

"అదేమిటీ?"

"అవును—అప్పుడు వాళ్లబ్రతుకులు కాబూలీవాళ్ల చేతుల లోనూ మార్వాడీల చేతులలోనూ నలుగుతూ వుండేవి. వాళ్లు సరేసరి అర్ధణాలూ అణాలూ వడ్డీలు బనాయించి కట్టి, మూతులు బిగబట్టి, రూపాయిలు పిండుకునేవాళ్లు—నేను కానీవడ్డీకి మించి ఎన్నడూ కట్టిన పాపాన పోలేదు."

"వాళ్లమీద దయారసం కొద్దీ వడ్డీలు తగ్గించానంటారా! వ్యాపారమంతా నీ వేపుకి రాబట్టుకునేందుకు ఫాయిదాలు తగ్గించావు. వాయిదాలు మాత్రం ఖచ్చితంగా..."

"లేకపోతే ఎట్లా? వ్యాపారమన్న తరవాత ఒక పద్ధతీ ఒక క్రమమూ వుండాలి. వాయిదాలు నిక్కచ్చిగా చూడకపోతే మన వ్యాపారమనలే సాగదు. అందులో నేనొక సులువు మార్గం చూపించాకూడా. ఏమిటంటే వాయిదావాటికి అసలీ ఫాయిదాలతో ఇవ్వలేనివాడు నాదగ్గరకే వొచ్చేది ఆ మొత్తమంతా

అప్పుతీసుకుని మరో పెద్దవస్తు వేదైనా తాకట్టుంచి చిన్నవస్తువు పట్టుకుపొయ్యేదీ..."

"అవును—ఆ బాకీ మళ్లీ వాయిదా నాటికి ఇవ్వలేకపోతే అంతకంటే పెద్దవస్తువు తాకట్టుంచేదీ—ఆఖరి పెద్దవస్తు వేదో అది మనకి దఖలు పడుతుంది. అంతే కదూ?"

వస్తువు పెద్దదిగానీ చిన్నదిగానీ వాయిదాలోపు అయితే వాళ్లదీ—వాయిదా దాటితే మనదీ చెప్పేదేముంది? డబ్బు పుష్కలంగా వున్నవాళ్లు పెద్దపెద్ద మొత్తాలు షాహుకారులకిచ్చుకుని వాళ్ల అవసరాలు గడుపుతున్నారు. నేనేమో చిన్నచిన్న మొత్తాలు సామాన్యులకిచ్చి వాళ్ల అవసరాలు గడుపుతున్నాను. ఇందులో నేను ప్రత్యేకంగా చేస్తున్న అన్యాయమేమిటి అని, అదీ నాకు పట్టుకుంటు. ఇహ నంతా పెద్దపెద్ద మొత్తాలు షాహుకారులకిచ్చే ఘరానా వ్యాపారస్థులే అయితే డబ్బులేని పాటకజనం ఏమై పోవాలి?"

"మనకెందుకూ? ఆ వ్యాపారం మరెవళ్లైనా చూచుకుంటారు లేన్లూ."

"ఎవరో ఏమిటి? ఇవ్వాళ ఈ వ్యాపారం మానుకున్నట్టయినా రేపు మీ బహదూర్ మామయ్యే తన చేతుల్లోకి తీసుకుంటాడిదంతా. అదిగో ఆ రాజన్న ఆయనచుట్టూ తిరుగుతున్నాడు. ఆయన్ని ఏ వ్యాపారంలో దూర్చనా అని చూస్తున్నాడు, లాభసాటి బేరమయితే మా నేదివను ఇట్లాంటి చాదస్తాలు పెట్టుకుని?"

"అసలు పెద్దపెద్ద మొత్తాలు అప్పిచ్చేవాళ్లకంటే ఎక్కువ వడ్డీలు మనమెందుకు వ్రాయించుకోవాలి?"

"వాళ్లకేమిపోయిందీ? ఏ తణఖాదస్తా వేతో రాయించుకుని ఇన్ను పెట్టెలో పారేసి కాలిమీద కాలేసుకుని, కడుపుమీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతారు. మన కట్లా సాగుతుందా? తెచ్చినవస్తువు మాయబంగారమో మచ్చిబంగారమో చూచుకోవాలి—దానికోక నమ్మకమైన కంసాలిమీద ఆధారపడాలి. ఒక్కొక్కసారి ఆ కంసాలి అప్పుకొచ్చినవాడితో లాలూచీ అవుతాడు. ఆ తరవాత ఆ వస్తువుని ఇనప్పెట్టెలో భద్రంగావుంచి దానికి వాయిదారోజు వరకూ బత్తెంలేని జవానులా కాపలా కాయాలి. వాళ్లకి దరువా చట్టుబండలా? అంతా అయింతరువాత 'ఒకటి చెప్పి ఒకటి రాయించావు—అప్పిచ్చిన రోజూ అది తీర్చినరోజూ రెండూ కలిపి వడ్డీ లెఖ్ఖ వేస్తావుటయ్యా?' అంటూ వ్యవహారమంతా కలికి మొదటకొస్తారు. ఇందులో ఎంత బాదరబందీ వుంది? అంచాత వడ్డీ కొంచె మెక్కువ వేస్తాను. లక్షాధికార్లంతా లక్షలు పోగుపడకముందు ఇట్లాంటి వ్యాపారాలు చేసినవాళ్లే. లక్షలు పోగుకున్న తరువాత మాత్రం అంతా నిరసించేవాళ్లే. అయితే అబ్బాయీ—నువ్వు వెళ్లిన పని ఏమయినట్టు?"

"అయిందయింది—అన్నీ తెగతెంపులయినాయి."

"కాదు మరి? నువ్వు వెళ్లి మళ్లీ ఆయన సాంప్రదాయం పూసెత్తి వుంటావు. వాళ్లు మన సాంప్రదాయమూ, మన వ్యాపార రహస్యమూ గట్టా దుమ్మెత్తి పోసివుంటారు..."

"ఇదంతా నువ్వే చేస్తూ..."

"నేనా."

"అవును వాళ్ల పనిమనిషి నాకమ్మ నీదగ్గర వస్తువేదో తాకట్టుంచితే దాన్ని వాయిదా వెళ్లిన మన్నాడే తెగనమ్మకోనా? అది వెళ్లి అక్కడ కంప్లెయింటు చెయ్యనా? కమల దానిని వెనకేసుకుని నన్ను నిగ్గదియ్యనా?"

"అమ్మ లేదులే—ఇంట్లో నేవుంది — కమలే అడిగింది! పోనీ అడిగితేమానె, అదేదో వెంకితనంగా మాట్లాడితే మా నాన్న గారికి కోపం వచ్చివుంటుంది—నేను చెప్పి దాని వస్తువు దానికిప్పించేస్తాలెమ్మని ఏకో వుదారంగా మాట్లాడి సర్దెయ్యలేకపోయినావా? నువ్వు అక్కడకూడా నన్ను సమర్థించివుంటావు. అవునా? పట్టూ విడుపూ వుండవక్కర్లే? ఎట్లాగూ నీకు రాజసం ఎక్కువరా అబ్బాయీ—దానిమీద వ్యవహారం చెడిపికొట్టివుంటుంది."

భాస్కరానికి వుక్రోషంగా వుంది. ఎవరిని ఎందుకు ఏమనాలో అతనికి బోధపడటం లేదు. తల గిర్రున తిరుగుతుంటే కుర్చీమీద అలాగే కూచుని దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

ఎదట దక్షిణపు గాలికి టపటప కొట్టుకుంటున్న క్యాలెండర్లో లక్స్ టాయిలెట్ సోప్ మీద రతన్‌బాయి పకపకా నవ్వుతోంది!

